క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి పలు కుటుంబాలు చేరిక



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపాలిటీ పరిధిలోని షాదిఖాన్ వెనుక భాగంలో ఉన్న ఖాజాపీర్, ఎస్.షబ్బీర్, షేక్ మహబూబ్‌చాంద్‌లతో పాటు పలు కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండవాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన



రేషన్ బండిని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : రేషన్ బియ్యంతోపాటు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆర్డీఓ జి.శ్రీనివాసులు పరిశీలించారు. పట్టణంలోని నాగులకట్టప్రాంతంలో ఇంటింటికి వెళ్లి నిత్యావసర వస్తువులను సరఫరా చేస్తున్న వాహనాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న నిత్యావసర వస్తువులు అందకపోతే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వం ఇంటింటికి రేషన్ సరఫరా చేయడం కోసమే వాహనాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో డీటీ వేణు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

పులివెందుల రూరల్ : ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రక్తనిధి మెడికల్ ఆఫీసర్ మొయిద్దీన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాసా థియేటర్ సమీపంలో ఉన్న సాంఘీక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహం విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడినట్లు అవుతుందన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ



అనాథలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎర్రగుంట్ల : స్థానిక రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణాల్లో అలాగే ముద్దనూరు రోడ్డుపై ఉన్న అనాథలకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం అర్ధరాత్రి ఆ సంస్థ ప్రతినిధులు చలికి వణుకుతున్న అనాథలను గుర్తించి వారి వద్దకే వెళ్లి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాతకోట శ్రీనివాసరెడ్డి, టీ వెంకటసురేష్, కేతన శ్రీనాథ్, విజయ్ నరసింహాలు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

చెన్నూరు : శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు శుక్రవారం బుడ్డాయపల్లిలోని రైతు భరోసా కేంద్రం పరిధిలో రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్సో ఫైనాన్షియల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడి గ్రామ పరిస్థితులపై అవగాహన చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఘనంగా గౌరమ్మ గ్రామోత్సవం

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామంలో గౌరమ్మతల్లి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పల్లకిపై కొలువు దీర్చి ట్రాక్టర్‌పై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి వెంట సాగిన జ్యోతుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నృత్యాలు చేస్తూ జ్యోతి ఉత్సవాలను నిర్వహించారు. అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కమలాపురం : పట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ గురుస్వామి డాక్టర్ కె.నరసింహ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నె స్వాముల కళశాలతో, ముత్తైదువుల దీపాలతో బాణ సంచా పేల్చుతూ, మేళ తాళాలు, భజనలతో శబరిమలై ఆచార వ్యవహార, తాంత్రిక పద్ధతులతో శోభాయమానంగా, అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన



పెద్దపసుపులలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి



పులివెందులలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పెద్దముడియం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారదర్శక పాలన సాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దపసుపుల గ్రామం సచివాలయం-2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను, సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామ సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.39 కోట్లు ఖర్చు చేశారన్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ వర్షాలు లేక పంటలు సాగుచేయలేకపోయామని సాగు చేసిన పంటలు కూడా వర్షం లేక ఎండిపోయాయని తమ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు తెలిపారు. సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి రైతులను ఆదుకునేదానికి ప్రయత్నిస్తామన్నారు. జగనన్న పాలన, టీడీపీ పాలనను బేరీజు వేసుకోవాలని ఎవరు ప్రజలకు మంచి చేశారో గ్రహించాలన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ కటారు నిర్మల, బాపతి రమణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, సి.మనోహర్, నాగేష్‌రెడ్డి, బాబురెడ్డి, సర్వేష్‌రెడ్డి, వై.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : రాష్ట్రంలో ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి జనం మెచ్చిన నాయకుడుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదురులేని మనిషిగా నిలిచారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సియోన్‌పురం సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయన సంక్షేమ పథకాల హోర్డింగ్‌ను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్‌లతో కలసి ప్రారంభించారు. అనంతరం సియోనుపురం, పురుషోత్తమరెడ్డి కాలనీ, అహోబిలాపురం ప్రాంతాలలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అమలు అవుతున్న తీరును వివరిస్తూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి గల వ్యత్యాసాలను, పథకాల అమలును ప్రజలకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : కుమ్మరాంపల్లె సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రఓబులరెడ్డి, మండల ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ మునేష్‌లు పాల్గొని మాట్లాడారు. అనంతరం సచివాలయ పరిధిలో ఆయా పథకాలతో లబ్ధిపొందిన వివరాలు, సంక్షేమాభివృద్ధికి సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసులు, బండెన్న, వెంకటశివ, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లేష్ , గంగాధర్, గృహసారథులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య తెలిపారు. తుమ్మలూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఈ నాలుగున్నరేళ్లల్లో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. అనంతరం సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అలాగే మానమ్మకం నువ్వే జగనన్న జెండాను ఎగవేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనువాసులు, నాగమల్లేశ్, ఎంపీటీసీ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : అర్హులైన వారందరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని యు.వెంకటాపురం సచివాలయంలో నిర్వహించిన ఏపీకి ముఖ్యమంత్రి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లే నా సైన్యమని పూర్తి నమ్మకంతో ఉన్నాడని ఆయన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచు పుల్లారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మిరామాంజనమ్మ, స్థానిక నాయకులు గంగయ్య యాదవ్, లక్ష్ముమయ్య, గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే మానసిక వైద్యనిపుణులు డాక్టర్ హరిత తలనొప్పి, నిద్రలేమి, ఆందోళన, దడ, భయం, వింత ఆలోచనలు, అనవసరం ఆలోచనలు, ఆత్మహత్య ఆలోచనలు తదితర వాటికి వైద్య చికిత్సలు అందించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు డాక్టర్లు అందుబాటులో ఉంటారని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568 286189 సంప్రదించాలన్నారు.

ఈవీఎంలపై అవగాహన

సింహాద్రిపురం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఈవీఎంలపై నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా ఓటర్లకు అవగాహన కల్పించారు. 2024 ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు ఈవీఎంలలో ప్రజలు వేసే ఓటు పడిందా లేదా అని తెలుసుకునే విధంగా అవగాహన కల్పించారు. వీవీ ప్యాక్‌లో మీరువేసిన ఓటు పడిందా లేదా చూసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డీటీ వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : మండలంలోని రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం దేవరాజుపల్లె, ఎల్లారెడ్డిపల్లె గ్రామాలలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో రబీ సీజన్లో బుడ్డ శనగ 1406 హెక్టార్లలో, మినుము 1500 హెక్టార్లలో, పెసర 20 హెక్టార్లలో, వేరుశనగ 250 హెక్టార్లలో నువ్వులు 10 హెక్టార్లలో సాగైందన్నారు. అయితే పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పని సరిగా ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఇవి చేస్తేనే అన్ని ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ఉద్యానవన పంటలు సాగు చేసిన రైతులు కూడా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏలు మంజుల, బాబు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించిన ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని కమలాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడీ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్ల, వీరపునాయనిపల్లె మండలాల పరిధిలోని ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. వ్యవసాయ అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, శ్యామ్‌బాబు, వ్యవసాయ అధికారి రవిశంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : రబీసీజన్‌లో సాగుచేసిన పంటలను రైతులు వ్యవసాయ సిబ్బందితో నమోదుచేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని శెట్టివారిపల్లె పరిధిలో సాగులో వున్న వేరుశనగ, ఆముదం పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వేరుశనగలో బెట్టను నివారించడానికి 1 ఎకరాకు 200 కిలోల జిప్సం చల్లి నీరుపెట్టాలన్నారు. మంచి దిగుబడికి ఊడలు దిగే సమయంలో ప్రతి రైతు జిప్సం వేయాలన్నారు. ఆముదం పంటలో పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక ఉధృతి అధికంగా వుందని వ్యవసాయాధికారుల సలహాలు పాటించి మందులు వాడాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో నానో యూరియా లిక్విడ్ రూపంలో అర లీటరు బాటిళ్ళు అందుబాటులో వున్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మామిడి రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారిణి జ్యోతిర్మయి

చెన్నూరు : మామిడి తోటల సస్యరక్షణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఉద్యానశాఖ అధికారిణి జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని గుర్రంపాడు గ్రామ పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన మామిడి రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు మట్టి పరీక్ష చేసుకోవాలని, మామిడి పూత బాగా రావడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యాన రైతులు గ్రూపుగా ఏర్పడి మండలంలో కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనికి గాను ఉద్యానశాఖ నుంచి 75 శాతం రాయితీ కల్పిస్తామని ఆమె తెలిపారు. వ్యవసాయాధికారిని శ్రీదేవి మాట్లాడుతూ ట్రైకోడర్మ విరిడి, సూడో మోనాస్ వినియోగం గురించి, వాటి లాభాల గురించి వివరించారు. నువ్వులు, వేరుసెనగ పంటల్లో సూటి ఎరువులు అయిన సింగిల్ ఫాస్ఫేట్‌ని వాడటం ద్వారా నూనె శాతం పెంచుకోవచ్చని తెలిపారు. రబీలో ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో కేవీకే సైంటిస్ట్ డాక్టర్ మానస, సర్పంచ్ ప్రమీల, వ్యవసాయ విస్తరణ అధికారి ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు కావడం పౌరుల విధి



అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు : 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్డీఓ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఓటర్లుగా నమోదు కావడం భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడు విధిగా భావించాలన్నారు. ఓటు హక్కులేని వారు మరణించిన వారితో సమానం అని ఓటర్లు తమ ఓటు హక్కుతో తనకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. ఏ ప్రాంతంలో ఉన్న ఓటర్లు ఆ ప్రాంతంలోనే ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీకాలేజి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డీటీ షఫి, వేణు, వలి, పాల నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు న్యాయం

ఎర్రగుంట్ల : గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు అన్ని విధాలా న్యాయం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టీ సుంకేసుల గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలును ప్రజలకు వివరించారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు తట్టుకోలేకపోతున్నారని మండి పడ్డారు. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంతుల్లయ్య, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ముద్దనూరు : శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల కురుక్షేత్ర మహాసంగ్రామం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ పిలుపునిచ్చింది. శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వర్గీకరణకు అన్ని పార్టీలు మద్దతు నిస్తున్నాయని, వర్గీకరణకోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాలెం దొరస్వామినాయుడు వర్ధంతి



పాలెం దొరస్వామినాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అహోబిలాపురం మెయిన్ పాఠశాలలో శుక్రవారం పాలెం దొరస్వామి నాయుడు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని పాలెం దొరస్వామినాయుడు విగ్రహానికి ఆయన కుటుంబసభ్యులు పాలెం బలరాం నాయుడు, శివశంకర్‌నాయుడు, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికోసం పాలెం దొరస్వామినాయుడు తన సొంత స్థలాన్ని పాఠశాల ఏర్పాటుకు ఇచ్చారన్నారు. అనంతరం పాఠశాలలో బాగా చదివి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఆరుమంది విద్యార్థులకు రూ.12 వేలు అందించారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు కమటం రాము, ఉపాధ్యక్షుడు తోటంశెట్టి హరి, ఆంజనేయుడు, శంకర్, దొరస్వామి నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని చూపిస్తున్న గ్రామస్తుడు ఎల్లారెడ్డి

కమలాపురం : మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో సర్వే నెంబర్ 569లో కబ్జాకు గురైన 16.08 ఏకరాల ప్రభుత్వ భూమిని అధికారులు స్పందించి స్వాధీనం చేసుకోవాలని అదే గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు అదే సర్వే నెంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమకు ఎల్లారెడ్డిపల్లెలో పొలాలు ఉన్నాయని, మా పొలాలకు ఆనుకుని సర్వే నెంబర్ 569 కాలువ పోరంబోకులో ఉన్న 16.08 ఏకరాల ప్రభుత్వ భూమిని నాగరాజు, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు కబ్జా చేశారన్నారు. దీనిపై గతంలో ఉన్న తహసీల్దార్ విజయ్‌కుమార్ సైతం ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అక్రమార్కులు తిరిగి కబ్జా చేయడమే కాక బోర్లు వేసి పంటలు కూడా సాగు చేస్తున్నారని, ఈ విషయాన్ని స్పందన ద్వారా అర్జీలు సైతం ఇచ్చామని వారన్నారు. విచారణకు వచ్చిన వీఆర్‌ఓ లక్ష్మీదేవి తమతో సంతకాలు తీసుకోకుండానే అర్జీ క్లోజ్ చేశారని వారు వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు కోరారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



పుల్లయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్



ప్రొద్దుటూరు ఆసుపత్రిలో మౌలాకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్యాం

ఎర్రగుంట్ల : పట్టణంలో నివాసముంటున్న జీ పుల్లయ్య ఆరోగ్యం బాగ లేక తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ పరిధిలోని క్లస్టర్-12కు చెందిన వలంటీర్ ఎస్.శివరామయ్య తిరుపతికి వెళ్లి ఆసుపత్రిలో ఉన్న పుల్లయ్యకు పింఛన్ అందజేశాడు.

ఆసుపత్రికి వెళ్లి..

కమలాపురం : పట్టణంలోని వికలాంగుల కాలనీకి చెందిన షేక్ మౌలాకు అదే కాలనీకి చెందిన వలంటీర్ శ్యాం ప్రొద్దుటూరు వెళ్లి పింఛన్ అందజేశాడు. మౌలా కాలు విరిగి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం శ్యాం అక్కడికి చేరుకుని పింఛన్ డబ్బులు అందజేశాడు. మౌలా వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

ఎయిడ్స్‌కు మందులేదు.. నివారణ ఒక్కటే మార్గం



పులివెందులలో ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



కమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు



జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

పులివెందుల టౌన్ : ఎయిడ్స్‌కు మందులేదు.. నివారణ ఒక్కటే మార్గమని పులివెందుల అర్బన్ సీఐ రాజు తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా స్థానిక కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సీఐ రాజు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ పూలంగళ్ల సర్కిల్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ యేసురత్నం, లయోలా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం నిర్వహించారు. కడప స్టెప్ డైరెక్టర్ సుబ్బరాయుడు, బోగా పార్వతమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ వారి బ్లడ్‌బ్యాంక్ బృందం, డాక్టర్ నాగేశ్వరరావు, లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఆర్ఆర్‌సీ, వైఆర్‌సీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కిరణ్ పర్యవేక్షణలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతీయ ఎయిడ్స్ నివారణవిభాగం, ప్రభుత్వ మహిళా డీగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దనోత్సవం సందర్భంగా పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మెడికల కళాశాల సూపరింటెండెంట్ విఘ్నేష్‌రావు, ప్రన్సిపాల్ వరలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డెవిడ్ సెల్వరాజ్‌లు ప్రారంభించి మాట్లాడారు. ఎయిడ్స్ పరీక్షలు చేయించుకుని ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ కేవలం శారీరక సంబంధం వల్ల, కలుషిత రక్తం ఎక్కించడం వల్ల, సుఖ వ్యాధులు తీవ్రత వలన మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. అనంతరం ర్యాలీలో ఎయిడ్స్‌కు మందులేదు నివారణ ఒక్కటే మార్గమని నినాదాలు చేస్తూ పూల అంగళ్ల వరకు చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్లు, సబ్‌యూనిట్ అధికారులు, డీపీఎంఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కమలాపురం : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కమలాపురం సీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్, ఐసీటీసీ కౌన్సిలర్ రాజారెడ్డి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్‌ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, ఈ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. హెచ్ఐవీ బారిన పడ్డ వారిపై వివక్ష చూపరాదని, వారు నిరాదరణకు గురికాకుండా సమాజంలో గౌరవంగా జీవించేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జూనియర్ సివిల్‌కోర్టు సెకండ్ క్లాస్ జడ్జి చిన్నలక్షుమయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి ప్రాణాంతక జబ్బు కాదని సరైన సమయంలో చికిత్స పొందితే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దేవగుడి నారాయణరెడ్డి, కె.మురళీధర్ రెడ్డి, మహేశ్వరి, రామ్మోహన్, జ్యోతి, సూర్య పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ఎయిడ్స్ రహిత సమాజం మనందరి బాధ్యత అని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరమ్మ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జెండా ఊపి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులచే ర్యాలీగా వెళ్లి స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద నినాదాలు చేశారు. ఎయిడ్స్, హెచ్ఐవిల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు స్వాతిసాయి, వైద్యులు నిజాముద్దీన్, శేఖర్, యోగాంజనేయులు, ప్రిన్సిపాల్ ఆర్ఆర్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ డాక్టర్ ఓబులరెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : ఎయిడ్స్ నివారణ మనందరి బాధ్యత అని మేడిదిన్నె పీహెచ్‌సీ వైద్యులు మహమ్మద్ హుస్సేన్, శృతి తెలిపారు. ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : బిదినంచర్ల ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌కు నివారణ ఓక్కటే మార్గమన్నారు. వైద్యులు ఖాజామొద్దీన్, పీఎంఓ రమణారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ యేసురత్నం, మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, ప్రిన్సి పాల్ రవికుమార్, స్వచ్ఛంద సంస్థ నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.